క్లుప్తంగా

ప్రజారోగ్యానికి విఘాతం కలిగిస్తే చర్యలు

• కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య



కాలువలో పేరుకుపోయిన పూడికలను పరిశీలిస్తున్న కమిషనర్

విజయనగరం: ప్రజారోగ్యానికి విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. రహదారులపై గాని, కాలువల్లో గాని చెత్తాచెదారాలు వేయకూడదని సూచించారు. కంటోన్మెంట్ ప్రాంతంలో ఆదివారం ఆయన పర్యటించి, కాలువల్లో చెత్త పేరుకుపోవడాన్ని గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలువలో చెత్త పేరుకుపోవడం వల్ల మురుగునీటి ప్రవాహానికి ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. వెంటనే పారిశుధ్య సిబ్బంది వచ్చి కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

ఓటరు నమోదుపై ఆరా



కొత్తపేట పోలింగ్ బూత్‌లో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుదర్శనరావు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేట, రామతీర్థం గ్రామాల్లో తహసీల్దార్ బి.సుదర్శనరావు ఆదివారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను సందర్శించి ప్రత్యేక ఓటరు నమోదుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలతో మాట్లాడి ఓటరు నమోదుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జనవరి నాటికి 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటర్లుగా చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ వీవీ గిరి, సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞానంతో పాటు వినోదం..



పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

డెంకాడ: గ్రంథాలయాలలో విజ్ఞానం అందించే పుస్తకాలతో పాటు వినోదాన్ని అందించే పుస్తకాలు కూడా ఉంటాయని స్థానిక శాఖా గ్రంథాలయాధికారి వై. మహేష్ అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాల కథల పుస్తకాలతో పాటు దేశభక్తుల జీవిత చరిత్రలు, జాతీయ నాయకులు సేవలు తెలిపే పుస్తకాలు చదివారు. ఆటవిడుపుగా కాసేపు క్యారమ్స్ ఆడారు. విద్యార్థులకు లైబ్రేరియన్ మహేష్ అల్పాహారాన్ని అందజేశారు.

శాస్త్రీయ నృత్య ప్రదర్శన పోటీలు



ఉత్తమ ప్రదర్శన చేసిన బృందానికి బహుమతులు అందజేస్తున్న సీతం కళాశాల కరస్పాండెంట్ శశి భూషణరావు

బొండపల్లి: సత్యసాయి జయంతి వేడుకల్లో భాగంగా మండలంలోని కొవ్వాడపేట గ్రామంలో శనివారం రాత్రి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శన పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 36 మహిళలు, బాలికల బృందాలు నృత్యప్రదర్శన చేశారు. వీరిలో ఉత్తమ ప్రదర్శన చేసిన నృత్య బృందాలకు సీతం కళాశాల కరస్పాండెంట్ మజ్జి శశిభూషణరావు బహుమతులు ప్రధానం చేశారు. దేవుపల్లి రాజరాజేశ్వరీదేవి ఆలయ అర్చకులు దూసి శ్రీధర్, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

స్థానిక ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వాల్సిందే..

జామి: స్థానిక సంస్థల ప్రతినిధులైన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు సరైన గౌరవం దక్కాల్సిందేనని ఎమ్మెల్సీ రఘురాజు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సరయు నేతృత్వంలో బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి తమకు అధికారుల నుంచి ఎప్పుడూ సరైన సమాచారం అందడం లేదన్నారు. తమ ఆమోదం లేకుండానే నిధుల కేటాయింపులు, ప్రతిపాదనలు చేస్తున్నారని చెప్పారు. అనంతరం ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు గౌరవం దక్కకపోతే తాను ఏ పోరాటానికైనా సిద్ధమన్నారు. ఎంపీపీ ఎస్.అరుణ, జెడ్పీటీసీ సభ్యురాలు సరయు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ఏవైనా ప్రజాప్రతినిధులుగా ప్రజల ఆమోదంతో గెలిచిన వారికి ప్రతి సమాచారం అందివ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

కార్యదర్శుల కొరత



విజయనగరం ఎంపీడీఓ కార్యాలయం

• ఒకరికి మూడు పంచాయతీల బాధ్యతలు
• ముందుకుసాగని అభివృద్ధి పనులు

విజయనగరం రూరల్: విజయనగరం మండలంలో పంచాయతీ కార్యదర్శుల కొరత వేధిస్తోంది. దీంతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. గత ప్రభుత్వంలో ప్రతీ పంచాయతీలో కార్యదర్శి, సచివాలయ సిబ్బంది ప్రజలకు సేవలు అందించేవారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలతో సచివాలయాలు కళకళలాడుతూ ఉండేవి. పూర్తిస్థాయి సిబ్బంది అందుబాటులో ఉండటంతో ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యేవి. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం సచివాలయాలను అంచెలంచెలుగా నిర్వీర్యం చేసేందుకు పూనుకుంది. మండలంలోని గొల్లలపేట, సారిక, ముడిదాం, రీమాపేట, పడాలపేట, నారాయణపురం, బడుకొండపేట గ్రామాల సచివాలయాలకు కార్యదర్శులు లేకపోవడంతో ఆయా గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండేసి పంచాయతీలకు ఒక డీడీఓ ఉండటంతో కార్యదర్శులు లేని పంచాయతీల్లో అభివృద్ధి పనులు జరగడం లేదు.

మూడు బాధ్యతలు ఆయనకే..

విజయనగరం మండల పంచాయతీ విస్తరణాధికారిగా విధులు నిర్వహిస్తున్న తిరుపతిరావు ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఏఓ దీర్ఘకాలిక సెలవుల్లో ఉండటంతో ఆ బాధ్యతలు కూడా తనే నిర్వర్తించాల్సి వస్తోందని అంటున్నారు. కార్యర్శుల కొరతపై ఆయన వద్ద సాక్షి ప్రస్తావించగా కార్యదర్శుల భర్తీపై ఇప్పటికే జెడ్పీ సీఈఓకు తెలియజేయడం జరిగిందన్నారు. ఇన్‌చార్జ్‌ల పాలనతో శతశాతం అభివృద్ధి సాధ్యపడటం లేదని తెలిపారు.

కొప్పల వెలమల అభివృద్ధికి పాటుపడాలి



శైలేష్‌ను సన్మానిస్తున్న నాయుడుబాబు, తదితరులు

• రాష్ట్ర వెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాయుడుబాబు

విజయనగరం ఫోర్ట్: వెలమల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని రాష్ట్ర వెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నెక్కల నాయుడుబాబు అన్నారు. ఆదివారం స్థానిక మంచుకొండ వారి మామిడి తోటలో కొప్పల వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వెలమ బంధువుల కార్తీక వన సమారాధన జరిగింది. ఈ సందర్భంగా 10వ తరగతిలో 598 మార్కులు సాధించిన తొత్తడి శైలేష్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ హోదాల్లో ఉన్న వారు పేద వెలమ కులస్తులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో కొప్పల వెలమ సంక్షేమ సంఘ నాయకులు, డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, బొత్స వరప్రసాద్, చలుమూరి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో ఘనంగా

ఎన్‌సీసీ వ్యవస్థాపక దినోత్సవం



ఎన్‌సీసీ విద్యార్థులతో సెంచూరియన్ వీసీ పీకే మహంతి తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఎన్‌సీసీ 76వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి మాట్లాడుతూ యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో ఎన్‌సీసీ ముందంజలో ఉందన్నారు. బాధ్యతాయుతమైన నాయకులుగా యువతను తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ పాత్ర ఎంతో ఉంటుందన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ క్రమశిక్షణ, సేవాస్ఫూర్తిని ప్రోత్సహించడంలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్‌ఎస్ వర్మ, ఎన్‌సీసీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాబోయ్.. రెల్లరాల్చు పురుగు..

• ఆందోళనలో సీతారామునిపేట రైతులు
• జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అధికారులు



సీతారామునిపేటలో గుర్తించిన రెల్లరాల్చు పురుగు



వరిచేలలో నేల రాలిన వెన్నులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేట వరి పంట పొలాల్లో రెల్లరాల్చు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోని వరి క్షేత్రాల్లో రెల్లరాల్చు పురుగులను ఏఓ పూర్ణిమ, గ్రామ వ్యవసాయ సహాయకులు తాజాగా గుర్తించారు. వరిపంట గింజ దశలో ఉండగా ఈ పురుగు అధికంగా వ్యాపించే అవకాశం ఉంది. ఈ పురుగు గొలను గొలికివేయడంతో గింజలు నేలరాలుతాయి. రెల్లరాల్చు పురుగు సాధారణంగా పగటి పూట దుబ్బుల్లో దాగి ఉంటాయి. సాయంత్రం సమయంలో బయటకి వచ్చి రాత్రంతా పంటకు హాని చేస్తుంటాయి. పంట చేతి కొచ్చే సమయంలో ఈ పురుగు దాడి చేయడం వల్ల దిగుబడి తగ్గి నష్టపోయే అవకాశం ఉందని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏఓ పూర్ణిమ ఏమన్నారంటే..!

సీతారామునిపేటలో రెల్లరాల్చు పురుగులను గుర్తించామని, నివారణకు రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్నామని చెప్పారు. రైతులు జాగ్రత్తలు తీసుకోకపోతే దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉందన్నారు. పంట చేనులో ఉంటుండగానే వెన్నులు కిందకి రాలిపోతుంటే పురుగు దాడి చేస్తున్నట్లు రైతులు గుర్తించాలన్నారు. ఈ సమస్యను ఇప్పటికే శాస్త్రవేత్తల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. 200 లీటర్ల నీటిలో క్లోరిపైరిఫాస్ 500 మిల్లీలీటర్లు లేదా ఇమామెక్టిన్ బెంజోఏట్ వంద గ్రాములు కలిపి ఎకరా పొలంలో పిచికారీ చేసుకోవాలని సూచించారు. కోతకు వారం రోజులు ముందు పిచికారీ చేసుకోవాలన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు రేపు

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి గ్రామంలో గల ద్వాదశ దేవాలయంలో మంగళవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త నీలాపు రాజారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్రతంలో పాల్గొనే 100 కుటుంబాలకు పూజా సామగ్రి ఉచితంగా ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న భక్తులు పాల్గొనాలని కోరారు.

ఆకట్టుకున్న విన్యాసాలు



ఎన్‌సీసీ క్యాడెట్ల విన్యాసం

విజయనగరం అర్బన్: ఎన్‌సీసీ 76వ వార్షికోత్సవాన్ని స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఎన్‌సీసీ క్యాడెట్లు నిర్వహించిన సాహస విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపేంద్ర మాట్లాడుతూ.. క్రమశిక్షణ, నాయకత్వం వంటి లక్షణాలు పెంపొందించడానికి ఎన్‌సీసీ శిక్షణలు దోహదపడతాయన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ.. క్యాడెట్లు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి మార్గాలను అన్వేషించుకోవాలని సూచించారు. అనంతరం సీతం, సత్య డిగ్రీ కళాశాల, ఎంఆర్ కళాశాల, రఘు ఇంజినీరింగ్ కళాశాల, గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్ క్యాడెట్లు సంయుక్తంగా నిర్వహించిన సాహస విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతులు అందజేశారు. రెండవ (ఆంధ్రా) గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో 230 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, ఆరుగురు అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు, 33 మంది ఇతర సిబ్బంది హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, వివిధ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మోహనరావు

నెల్లిమర్ల: యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం స్థానిక ప్రభుత్వ పింఛన్‌దారుల భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు, జిల్లా గౌరవాధ్యక్షులు మీసాల అప్పలనాయుడు హాజరయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి పొట్నూరు వాసుదేవరావు వ్యవహరించారు. యూటీఎఫ్ నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా మద్దిల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా లెంక సన్యాసినాయుడు, గౌరవాధ్యక్షుడిగా గాడు పరమేశ్వరరావు, సహాధ్యక్షులుగా వంగపండు సురేష్‌బాబు, కొండల పద్మావతి, కోశాధికారిగా బోని రమణ, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సురట రాజేంద్రప్రసాద్, సీపీఎస్ కన్వీనర్‌గా సుంకర చలపతిరావు, జిల్లా కౌన్సిలర్లుగా రెడ్డి ఆసిరినాయుడు, గొర్లె మధు, బి.లక్ష్మణరావు, చందక కృష్ణ, పీపీ శ్రీనివాసరావు, కొండపల్లి జయరామ్, జి.కుమారస్వామి, రెడ్డిపల్లి చంద్రకళ, మాత కిశోర్‌కుమార్, ఎస్.సప్తగిరి ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గాన్ని జిల్లా కార్యదర్శి పతివాడ త్రినాథ్ అభినందించారు.

చిలకలగెడ్డలో ట్రెక్కింగ్

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ఆదివారం చిలకలగెడ్డ ప్రాంతంలో ట్రెక్కింగ్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా యువత క్రమ శిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవరుచుకుంటారని చెప్పారు.

పిచ్చి మొక్కల తొలగింపు..



నగరంలోని కేఎల్ పురం రాధాకృష్ణ ఆలయాన్ని ఆనుకుని ఉన్న చెరువులో పిచ్చిమొక్కలు పెరిగి విష జంతువులకు ఆవాసంగా మారాయి. దీంతో ఆలయ కమిటీ సభ్యుడు తాళ్లపూడి గణేష్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, స్థానికులు ఆదివారం మొక్కలు తొలగించారు. అలాగే చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కలను తొలగించడంతో పాటు ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా చెరువు గట్టుపై విద్యుత్ దీపాలంకరకణ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పలువురు పాల్గొన్నారు. – విజయనగరం రూరల్

అపూర్వ కలయిక..



డెంకాడ మండలంలోని పెదతాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996 – 97 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పెదతాడివాడలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం కలుసుకున్నారు. చిన్నప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. అప్పటి ఉపాధ్యాయులను సత్కరించి గురుభక్తిని చాటుకున్నారు. – డెంకాడ

ఆలయ కమిటీల్లో విశ్వబ్రాహ్మణులకు స్థానం కల్పించాలి



మాట్లాడుతున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళాబత్తుల శ్రీనివాసరావు

• విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు



కార్యక్రమంలో పాల్గొన్న సంఘ ఉద్యోగులు, తదితరులు

డెంకాడ: ఆలయ కమిటీల్లో విశ్వ బ్రాహ్మణులకు చోటు కల్పించాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి తాళాబత్తుల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని చింతలవలసలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆలయ కమిటీల్లో బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులకు చోటు కల్పించి విశ్వబ్రాహ్మణులను విస్మరించడం బాధాకరమన్నారు. విశ్వబ్రాహ్మణులకు చట్ట సభల్లో కూడా తగిన స్థానం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.సన్యాసిరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుగంధం నాగమల్లేశ్వరరావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు కోసూరి విజయ్‌భాస్కరరావు, జిల్లా నాయకులు ఆవుపాటి నాగభూషణరావు, కోసూరి రాంబాబు, ఉమామహేశ్వరరావు, ఉమాపతి, సోమశేఖర్, సంఘ నాయకులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవం..

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘ జిల్లా నూతన శాఖ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైందని రాష్ట్ర నాయకులు ప్రకటించారు. సంఘ జిల్లా అధ్యక్షుడిగా కాకినాడ ఉమామహేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షులుగా అప్పరభట్ల నరసింహరాజు, ఆవుపాటి నాగభూషణం, కన్వీనర్‌గా కోసూరి రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా వదురుపర్తి గీత సత్య ఉమాపతి, కోశాధికారిగా మంతెన అప్పలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శంభాన లక్ష్మణరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కెల్ల సోమశేఖర్ ఎన్నికయ్యారని తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

• విపక్ష నాయకులు

నెల్లిమర్ల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని విపక్ష నాయకులు పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక మొయిద జంక్షన్‌లోన్ విపక్షాలు కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా తెలిపాయి. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు కిల్లంపల్లి రామారావు, కనకల రాము.. ఏఐటీయూసీ నాయకుడు మొయిద పాపారావు.. ఐఎఫ్‌టీయూ నాయకుడు కాళ్ల అప్పలసూరి, ఐఎన్‌టీయూసీ నాయకుడు కనకల పద్మనాభం మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయడంతో పాటు నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులతో కుమ్మక్కై కార్మిక హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. ఇప్పటికే నెల్లిమర్ల జూట్ మిల్లుతో బాటు మండలంలో సుమారు 31 పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. దీంతో సుమారు 30 వేల మంది కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మూతపడిన పరిశ్రమలను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా సౌరశక్తి విద్యుత్ ఒప్పందాల్లో అవినీతికి పాల్పడిన అదానీని తక్షణమే అరెస్ట్ చేయాలని కోరారు.

చింతపల్లి బీచ్‌కు పోటెత్తిన పర్యాటకులు

సముద్రంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు



పూసపాటిరేగ: కార్తీకమాసం నాలుగవ ఆదివారం కావడంతో పూసపాటిరేగ మండలంలోని చింతపల్లిబీచ్‌కు పర్యాటకులు పోటెత్తారు. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చి చింతపల్లిబీచ్‌ను సందర్శించారు. చింతపల్లిరేవులో సముద్ర స్నానాలు ఆచరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూసపాటిరేగ ఎస్సై ఐ.దుర్గాప్రసాద్, చింతపల్లి మెరైన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై వి. శ్రీనివాసరావులు బందోబస్తు నిర్వహించారు. ముందుగా గోవిందపురం ముక్తిధాం క్షేత్రాన్ని పర్యాటకులు సందర్శించి పూజలు చేశారు.